సాక్షి
జోగులాంబ గద్వాల

శుక్రవారం। 13। సెప్టెంబర్। 2024



లక్ష్యానికి చేరువలో..
జూరాల దిగువ, ఎగువ కేంద్రాల్లో విద్యుదుత్పత్తిని వేగవంతంగా కొనసాగుతుంది.

వివరాలు 8లో ▸



ఇంటింటి సర్వే
సీఎం స్వగ్రామం కొండారెడ్డిపల్లిలో సౌర విద్యుత్‌పై ఇంటింటి సర్వే చేస్తున్నారు.

వివరాలు 8లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
33.4 /21.8

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల అర్బన్‌: ప్రథమ్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో యువతకు నెల రోజులపాటు ఎలక్ట్రీషియన్‌ కోర్సుల్లో ఉచిత శిక్షణ, అనంతరం ఉద్యోగావకాశం కల్పించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనశాఖ అధికారిణి ప్రియాంక గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని 18–30 మధ్య వయస్సు ఉండి, పదో తరగతి, ఇంటర్మీడియట్‌, డిగ్రీ, ఐటీఐ ఎలక్ట్రీషియన్‌ చదివిన వారు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ఎన్‌ఎస్‌డీసీ సర్టిఫికెట్‌ అందజేయడం జరుగుతుందని, మరిన్ని వివరాలకు సెల్‌ నం .6303430789కు సంప్రదించాలని తెలిపారు.

బడి బయటి పిల్లల గుర్తింపు.. బడిలో చేరిక



గట్టు: ఆరగిద్ద గ్రామంలో బడి మానేసి, వివిధ పనుల్లో నిమగ్నమైన విద్యార్థులను గుర్తించి గురువారం బడిలో చేర్పించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, డీసీపీఓ ఆదేశాల మేరకు చైల్డ్‌ లైన్‌ దస్తగిరి, ఓఆర్‌డబ్ల్యూ లక్ష్మీ ఆరగిద్ద గ్రామంలో పర్యటించారు. 8,9,10వ తరగతి చదువుకుంటుకున్న 8 మంది విద్యార్థులు బడి మధ్యలో మానేసి, వివిధ పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ విషయం గురించి చైల్డ్‌ హెల్ప్‌ లైన్‌కు సమాచారం అందడంతో అధికారులు గ్రామంలో పర్యటించి విద్యార్థులను గుర్తించారు. వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు. అలాగే, 18 ఏళ్ల నిండక ముందే అమ్మాయికి వివాహం చేస్తున్నారన్న సమాచారం అందడంతో చైల్డ్‌ లైన్‌ అధికారులు సదరు బాలికను గుర్తించి, సీడబ్ల్యూసీ ముందు హాజరు పరచారు. కార్యక్రమంలో హైస్కూల్‌ హెడ్మాస్టర్‌ జహీర్‌బేగ్‌, పోలీస్‌ కానిస్టేబుల్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు ఆర్టీసీ మెరుగైన సేవలు



స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: సూపర్‌ లగ్జరీ, డీలక్స్‌ బస్సుల్లో లక్కీడ్రా సౌకర్యాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని రీజినల్‌ మేనేజర్‌ వి.శ్రీదేవి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో గురువారం మహబూబ్‌నగర్‌ డిపోకు సంబంధించిన సూపర్‌ లగ్జరీ నెలవారీ లక్కీడ్రా, రీజియన్‌లోని పది డిపోలకు చెందిన 15 రోజుల డీలక్స్‌ బస్సుల లక్కీడ్రా కార్యక్రమం నిర్వహించారు. డీలక్స్‌, సూపర్‌ లగ్జరీ బస్సుల్లో ప్రయాణం చేసి బాక్సుల్లో వేసిన టికెట్లకు డ్రా తీశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎం మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. సంస్థ ఆదాయం పెంచడం కోసం ఉద్యోగులు కష్టపడి పనిచేయాలని కోరారు. మహబూబ్‌నగర్‌ డిపోకు సంబంధించి సూపర్‌లగ్జరీ బస్సుల లక్కీ డ్రాలో సునీత, అనురాధ, రాజు, రీజియన్‌కు సంబంధించి డీలక్స్‌ బస్సుల లక్కీ డ్రాలో గాయత్రి, శ్రవంతి, పల్లవి, రజిత, చంద్రకళ, నందిని గెలుపొందారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్‌ మేనేజర్‌ లక్ష్మీధర్మ, డిపో మేనేజర్‌ సుజాత తదితరులు పాల్గొన్నారు.

శారీరక పెరుగుదలకు క్రీడలు దోహదం

మహబూబ్‌నగర్‌ క్రైం: పోలీస్‌ వ్యవస్థ అన్నిరంగాల్లో పటిష్టంగా పని చేయాలంటే శారీరక సామర్థ్యంతోపాటు ఉత్తమ నైపుణ్యం ఎంతో అవసరమని ఎస్పీ జానకి అన్నారు. జడ్చర్ల డీటీసీ కేంద్రంలో గురువారం ఎస్‌సీటీపీసీ స్పోర్ట్స్‌, గేమ్స్‌ మీట్‌ ముగింపు కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. శాంతిభద్రతలతో పాటు ప్రజల ఆస్తులు, మాన, ప్రాణ, నేరాలు, విధ్వంసాలు జరగకుండా కాపాడటం కోసం పోలీస్‌ వ్యవస్థ ఏర్పాటు చేశామని, ఈ పరిస్థితుల్లో ఉత్తమ సేవలు అందించాలంటే శారీరక సామర్థ్యం, ఇతర నైపుణ్యాలు ఎంతో అవసరమన్నారు. దీనికోసం శిక్షణతోపాటు క్రీడలు కూడా ఎంతో దోహదపడతాయని చెప్పారు. క్రీడలు, పట్టుదల, శక్తి సామర్థ్యాలు, పోటీతత్వాన్ని పెంచుతాయని తెలిపారు. ప్రతి రంగంలో క్రీడలకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం పలు రకాల ఇండోర్‌, అవుట్‌ డోర్‌ క్రీడలలో గెలుపొందిన విజేతలకు ఎస్పీ బహుమతులు అందించారు.



నేతన్నకు ఊరట..!

చేనేత త్రిఫ్ట్‌ బకాయిలు విడుదల చేసిన ప్రభుత్వం

- మూడు జిల్లాలకు రూ.13.95 కోట్లు మంజూరు
- మొత్తం 8,147 కార్మికులకు లబ్ధి
- 11 నెలలుగా ఆర్‌డీ– 2 సొమ్ము కోసం ఎదురుచూపులు



త్రిఫ్ట్‌ చెక్కులను లీడర్లకు అందజేస్తున్న ఏడీ గోవిందయ్య

రాజోళి: చేనేత కార్మికులు మూడేళ్లుగా ఎదురుచూస్తున్న త్రిఫ్ట్‌ బకాయిలను ఎట్టకేలకు ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో నేత కార్మికులకు ఎంతో ఊరట కలగనుంది. వస్త్రాల తయారీపై వచ్చే డబ్బును కూడబెట్టుకునేందుకు తీసుకొచ్చిన పథకమే చేనేత త్రిఫ్ట్‌. ఇందులో కార్మికుడు సంపాదించిన దాంట్లో 8 శాతం బ్యాంకు ఖాతా (ఆర్‌డీ–1) లో జమ చేస్తే.. దీనికి ప్రభుత్వం రెండో ఖాతా (ఆర్‌డీ–2) లో 16శాతం డబ్బును జమ చేస్తుంది. ఈ డబ్బు మొత్తాన్ని మూడేళ్ల తర్వాత తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. గత మూడేళ్ల కిందట ప్రారంభమైన ఈ పథకం కార్మికుల్లో జమ ఖాతాలను పెంచింది. కార్మికులకు చేయూతనిచ్చే విధంగా రూపొందించిన ఈ పథకంలో గత 11 నెలలుగా రెండో ఖాతాలో నగదు జమ కాకపోవడంతో కార్మికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. రెండేళ్లకు పైబడి జమ చేసుకున్న నగదు తమకు అందుతుందా లేక నూతన ప్రభుత్వం ఏమైనా కొర్రీలు పెడుతుందా అని జిల్లాలో చేనేత కార్మికులు ఆందోళనకు గురయ్యారు. ఆర్‌డీ–2 నిధుల కోసం చేనేత జౌళి శాఖ అధికారులు.. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల వద్దకు క్యూ కట్టి, వినతి పత్రాలు అందచేశారు. ఎట్టకేలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో కార్మికులు ఊపిరి పీల్చుకున్నారు.

ఆగస్టు 2021లో...

2021 ఆగస్టులో చేనేత త్రిఫ్ట్‌ పథకానికి అప్పటి ప్రభుత్వం రూపకల్పన చేసింది. ఈ పథకంలో చేనేత కార్మికుడు తాను సంపాదించే ఆదాయంలో 8 శాతం ఆర్‌డీ–1 ద్వారా చెల్లించుకుంటే, కార్మికుడు కట్టిన దానికి డబుల్‌ నగదును ప్రభుత్వం ఆర్‌డీ–2లో జమ చేస్తుంది. దీని కోసం కార్మికులు ప్రతి నెలా తాము బ్యాంకులో నగదను జమ చేసి, బ్యాంకు ధ్రువీకరణతో చేనేత అధికారులను కలిస్తే, అక్కడి నుంచి ఆర్‌డీ–2 లో కార్మికుడి పేరిట నగదు జమ అవుతుంది. మూడేళ్ల కాలపరిమితి గల ఈ పథకంలో ఆది నుండి సజావుగా నడిచినప్పటికీ గత 11 నెలల నుండి ఆర్‌డీ–2 చెక్కులు పెండింగులో ఉన్నాయి. కాగా కార్మికుడు రూ.300 నుండి మొదలుకుని, రూ.1200 వరకు ఆర్‌డీ–1లో జమ చేసుకునే అవకాశం ఈ పథకంలో ఉంది.

అనుమానాలు.. ఆందోళనలు

రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో కార్మికులు చేనేత త్రిఫ్ట్‌ పథకంపై ఎలాంటి ప్రభావం చూపుతుందోనని ఆందోళన చెందారు. దీనికితోడు 11 నెలలుగా పెండింగ్‌లో ఉంచడంతో పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. చేనేత కార్మికుల్లో ఆయా పార్టీల్లో నాయకులు కూడా ఉండటంతో ఈ పథకానికి ఏమైనా రాజకీయ నీడలు అలుముకుంటాయా అనే అనుమనాలు వచ్చాయి. కానీ ప్రభుత్వం గత నెలలో నిధులు విడుదల చేయగా.. వాటికి సంబంధించిన చెక్కులను చేనేత జౌళి శాఖ ఏడీ గోవిందయ్య, సంబంధిత లీడర్లకు అందచేశారు. దీంతో కార్మికుల మూడేళ్ల ఎదురుచూపులకు ఎట్టకేలకు చెక్‌ పడింది.

రూ.13.95 కోట్లు విడుదల..

జోగుళాంబ గద్వాల, నాగర్‌కర్నూలు, వనపర్తి జిల్లాలోని 8,147 కార్మికుల కోసం 11 నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఆర్‌డీ–2 చెక్కులకు గాను రూ.13.95 కోట్లను కార్మికులకు అందజేసేందుకు ఆయా బ్యాంకులకు చెక్కులను జారీ చేశారు. ఈ మేరకు బ్యాంకుల్లో ప్రక్రియ మొదలైనట్లు అధికారులు వెల్లడించారు. త్వరలోనే కార్మికులు ఆర్‌డీ–1 లో జమ చేసుకున్న నగదుతో పాటు, ప్రభుత్వం ఇచ్చే ఆర్–2 తో కలిపి అందనున్నాయి. దీంతో కార్మికులకు ఊరట లభించినట్లయ్యింది.

త్వరలోనే ఖాతాల్లో జమ చేస్తాం



నాగర్‌కర్నూల్‌, జోగుళాంబ గద్వాల, వనపర్తి జిల్లాలకు సంబంధించిన ఆర్–2 చెక్కులకు సంబంధించిన నిధులు విడుదల అయ్యాయి. వీటికి సంబంధించి బ్యాంకర్లకు ధ్రువీకరణ పత్రాలు అందాయి. కార్మికులకు కూడా త్వరలోనే వారి ఖాతాల్లో జమ అవుతాయి.

– గోవిందయ్య, చేనేత జౌళి శాఖ ఏడీ

ఉత్సాహంగా జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌ ఎంపిక పోటీలు



జెండా ఊపి పోటీలను ప్రారంభిస్తున్న డీవైఎస్‌ఓ బీఎస్‌ ఆనంద్‌

గద్వాలటౌన్‌: గెలుపు ఓటముల కంటే పోటీల్లో క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించడం ప్రధానమని జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి బీఎస్‌ ఆనంద్‌ పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌ పోటీల కోసం జిల్లా అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీలు ఉత్సాహంగా సాగాయి. గురువారం స్థానిక మల్టీపర్పస్‌ ఇండోర్‌ స్టేడియంలో అండర్‌ –14, 16, 18, 20 విభాగాలలో బాలురు, బాలికలకు వేరువేరుగా నిర్వహించిన జిల్లాస్థాయి ఎంపిక పోటీలు జరిగాయి. 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, 1500 మీటర్లు పరుగు పందెంతో పాటు లాంగ్‌జంప్‌, హైజంప్‌, షాట్‌పుట్‌, డిస్కత్రో, జావలిన్‌ త్రో విభాగాలలో క్రీడాకారులు పోటీపడ్డారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 750మంది విద్యార్థులు పోటీలలో పాల్గొన్నారు. జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌ ఎంపిక పోటీలను డీవైఎస్‌ఓ బీఎస్‌ ఆనంద్‌ జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టుదల, శ్రద్ధ అనేది క్రీడల వల్ల అలవడతాయన్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభ చాటిన 30 మంది క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన వారందరూ ఈ నెల 19, 20వ తేదీలలో హైదరాబాద్‌ ఉస్మానియా యూనివర్సిటీ సేడియంలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్‌ ఛాంపియన్‌షిప్‌ పోటీలలో పాల్గొంటారని జిల్లా అథ్లెటిక్స్‌ అసోసియేషన్‌ అధ్యక్ష, కార్యదర్శులు బీసన్న, సతీష్‌ కుమార్‌ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్‌ జిల్లా కార్యదర్శి జితేందర్‌, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణయ్య, పీఈటీలు భరత్‌కుమార్‌, నగేష్‌బాబు, వెంకట్రాములు, బషీర్‌, శైలజ, రజనికాంత్‌, జగదీష్‌, నర్సింహరాజు పాల్గొన్నారు.



జావెలిన్‌ను విసురుతున్న క్రీడాకారుడు

జిల్లా ఆస్పత్రి అభివృద్ధికి చర్యలు



ఎస్‌డీపీ మిషన్‌ ఉంచిన ప్రత్యేక గదిని ప్రారంభిస్తున్న కలెక్టర్‌ బీఎం సంతోష్‌

గద్వాల క్రైం: జిల్లా ప్రభుత్వాసుపత్రి అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు కలెక్టర్‌ సంతోష్‌ వెల్లడించారు. గురువారం ఎస్‌డీపీ(సింగిల్‌ డోనర్‌ ప్లేట్‌లెట్‌) మిషన్‌ను ఆసుపత్రిలో కలెక్టర్‌ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సీజనల్‌ వ్యాధుల సమయంలో ప్రజలు పలు విష జ్వరాల బారిన పడిన క్రమంలో ప్లేట్‌లెట్లు పడిపోతాయని, ఎస్‌డీపీ మిషన్‌ ద్వారా రోగులకు అత్యవసర సమయంలో ప్రాణాధారమైన ప్లేట్‌లెట్స్‌ను అందిస్తుందన్నారు. వివిధ సందర్భాల్లో సరైన వసతులు లేక రోగులు ఇబ్బందులు పడ్డారని, భవిష్యత్తులో అవసరమయ్యే అధునాతన పరికరాలు ఏర్పాటు చేసేందుకు సిబ్బంది నివేదికలు అందజేయాలని అన్నారు. మందుల కొరత లేకుండా ఎప్పటికప్పుడు స్టాక్‌ను గుర్తించి అవసరమయ్యే మందులను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం మిషన్‌ పని తీరును సిబ్బంది కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్‌ వినోద్‌ కుమార్‌, తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరనున్న మార్కెట్‌ కమిటీ పాలకవర్గం

- నేటి ప్రమాణ స్వీకారానికి ముస్తాబైన అలంపూర్‌ మార్కెట్‌యార్డు
- హాజరు కానున్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి



మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ ఉప్పరి దొడ్డెన్న, వైస్‌ చైర్మన్‌ కొమ్ము కుమార్‌

అలంపూర్‌: ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసిన అలంపూర్‌ మార్కెట్‌ కమిటీ నూతన పాలకవర్గం శుక్రవారం కొలువుదీరనుంది. ఉదయం 10గంటలకు నిర్వహించే ప్రమాణ స్వీకారానికి అలంపూర్‌ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్‌ యార్డులో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఇక చైర్మన్‌గా అయిజ మండలం బింగిదొడ్డికి చెందిన ఉప్పరి దొడ్డెన్న, వైస్‌చైర్మన్‌గా రాజోలి మండలం పచ్చర్లకి చెందిన కొమ్ము కుమార్‌ ప్రమాణ స్వీకారం చేసున్నారు. వీరితో పాటు సభ్యులుగా కే.రుక్మిందర్‌ రెడ్డి, బీ.చెన్న కృష్ణారెడ్డి, యంగమ్మ గారి కృష్ణయ్య, ఎం. నాగరాజు, సంధ్య పోగు గోరంట్ల, సులోచన, ఎల్‌. రుక్మానందరెడ్డి, చిన్న మస్తాన్‌, బీ. శ్రీకాంత్‌, పీ లక్ష్మీంధర్‌ రెడ్డి, ఎరుకలి రంగస్వామి, పుష్పాల వెంకటేష్‌, ఎస్‌కే హమీద్‌, వడ్డేపల్లి పీఏసీఎస్‌ చైర్మన్‌, జిల్లా మార్కెటింగ్‌ శాఖ అధికారిని, అసిస్టెంట్‌ డైరెక్టర్‌ ఆఫ్‌ అగ్రికల్చర్‌, అలంపూర్‌ మున్సిపాలిటీ ప్రత్యేక అధికారి ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

ఆర్నెళ్ల తర్వాత పాలకవర్గం

అలంపూర్‌ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్‌ యార్డు పాలకవర్గం గత ఆరు నెలలుగా ఖాళీగానే ఉంది. గత ప్రభుత్వ హయాంలో మార్కెట్‌ యార్డు కమిటీ చైర్‌పర్సన్‌గా ఉత్తనూరు సువర్ణ కొనసాగారు. 2022 అక్టోబర్‌ 22న చైర్‌పర్సన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 3వ తేది వరకు చైర్‌పర్సన్‌గా ఆ కమిటీ సభ్యులు బాధ్యతలు చేపట్టడం జరిగింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వం నామినేటెడ్‌ పదవులను భర్తీ చేయడానికి పూనుకుంది. అందుకు అనువుగా ఆశావహుల జాబితాను ఈ ఏడాది మార్చి 31న మార్కెటింగ్‌ శాఖకు పంపించారు. రాజకీయ కారణాలతో ఇప్పటికి కమిటీని నియమిస్తూ ఈ నెల 5వ తేదీన ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆరు నెలల తర్వాత కొత్త పాలక మండలి ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టనున్నారు.


మంత్రుల రాక

ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్ర మార్కెటింగ్‌ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌ రావు, రాష్ట్ర ఎక్సైజ్‌ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవితోపాటు ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌ కుమార్‌ హాజరుకానున్నారు. వీరితోపాటు మార్కెటింగ్‌ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ ప్రసాద్‌రావు, మార్కెటింగ్‌ శాఖ రీజనల్‌ డైరెక్టర్‌ మల్లేశం, జిల్లా మార్కెటింగ్‌ శాఖ అధికారిణి పుష్పమ్మ, మార్కెట్‌ యార్డు కార్యదర్శి ఎల్లస్వామి హాజరు కానున్నారు. నియోజకవర్గంలోని ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు.

అసమానతలు లేని సమాజం కోసం కృషి

గద్వాల అర్బన్‌: ఆర్థిక అసమానతలు, అంతరాలు లేని సమాజాన్ని ఆకాంక్షించి, ఈ ఆశయాల కోసం చివరి శ్వాస వరకు ఉద్యమించిన పోరాట యోధుడు సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి అన్నారు. శ్వాసకోశ సమస్యతో సీతారాం ఏచూరి గురువారం మృతి చెందగా జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ.. ఏచూరి విద్యార్థి దశ నుంచే ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటూ ఎస్‌ఎఫ్‌ఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పని చేసి విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. అటవీహక్కుల చట్టం, గ్రామీణ ఉపాధి హామీ చట్టం, సమాచార హక్కు చట్టం, జాతీయ ఆహార భద్రత తదితర చట్టాల రూపకల్పనలో ఏచూరి కీలకపాత్ర పోషించారన్నారు. తన జీవితాంతం పార్టీ నియమాలు, సిద్ధాంతాలకు అనుగుణంగా, నిజాయితీ, నిబద్ధతతో వ్యవహరించి, కార్యకర్తలకు ఆదర్శంగా నిలిచారని తెలిపారు కార్యక్రమంలో నాయకులు వీవీ నర్సింహ్మా, ఉప్పేరు నర్సింహ, రామకృష్ణ, సీతారాం, ఆంజనేయులు ఉన్నారు.

పోడు గోడు తీరేనా?



'నాగర్‌కర్నూల్‌ జిల్లా అమ్రాబాద్‌ మండలం కొమ్మనపెంటకు చెందిన దంసాని లింగయ్య అడవిలో 4 ఎకరాల భూమిని సుమారు 40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాడు. ప్రభుత్వం పోడు పట్టాల కోసం అవకాశం ఇవ్వడంతో గతంలోనే దరఖాస్తు చేసుకున్నాడు. ప్రభుత్వం ఇప్పటి వరకు పట్టా ఇవ్వలేదని, త్వరగా పంపిణీ చేయాలని వేడుకుంటున్నాడు.'

- ఏళ్లతరబడి అటవీ భూముల పట్టాలకు నోచుకోని రైతులు
- దరఖాస్తుల పరిష్కారంపై ప్రభుత్వం నుంచి స్పష్టత కరువు
- ఉమ్మడి పాలమూరులోని నాలుగు జిల్లాల్లో పోడు సాగు
- అత్యధికంగా నాగర్‌కర్నూల్‌ జిల్లాలో 7,514 దరఖాస్తులు
- సింహభాగం తిరస్కరణకే మొగ్గుచూపుతున్న వైనం



నాగర్‌కర్నూల్‌ జిల్లా లింగాల మండలం రాయవరంలో పోడు భూములు

సాక్షి, నాగర్‌కర్నూల్‌: అటవీ భూముల్లో పోడు సాగు చేస్తున్న రైతులకు పట్టాల పంపిణీ ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోవడం లేదు. దీంతో ఏటా అటవీశాఖ అధికారులు, రైతులకు మధ్య వివాదం చెలరేగుతోంది. పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతూ రైతులకు పట్టాలను పంపిణీ చేస్తామని ప్రభుత్వం చెబుతున్నా అమలుకు నోచుకోవడం లేదు. ఇప్పటికే జిల్లాలోని గ్రామాల వారీగా పోడు దరఖాస్తులు స్వీకరించి, వాటి పరిష్కారం కోసం అధికారులు క్షేత్రస్థాయి సర్వే చేపట్టారు. అయితే పట్టాల పంపిణీ చేయకపోవడంతో నిరీక్షణ తప్పడం లేదు.

దరఖాస్తులు ఇలా..

ఉమ్మడి జిల్లాలోని నాగర్‌కర్నూల్‌, మహబూబ్‌నగర్‌, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో పోడు భూములు ఉండగా.. పట్టాలు ఇవ్వాలని 15,583 మంది దరఖాస్తులు చేసుకున్నారు. అయితే నాగర్‌కర్నూల్‌ జిల్లాలో అత్యధికంగా 7,514 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో మండల, జిల్లాస్థాయిలో కమిటీలు ఇప్పటి వరకు మొత్తం 1,950 దరఖాస్తులకు ఆమోదం తెలపగా.. వీటికి సంబంధించిన పట్టాల పంపిణీ చేయలేదు.

- మహబూబ్‌నగర్‌ జిల్లాలో 4,528 దరఖాస్తులు రాగా.. 114 దరఖాస్తులకు మాత్రమే ఆమోదం తెలిపారు. జిల్లాస్థాయి కమిటీలో ఇప్పటి వరకు 19 మంది రైతులకు చెందిన 23.20 ఎకరాల భూమికి ఆమోదం లభించింది. అటవీ భూముల్లో నుంచి ఫతేపూర్‌ మైసమ్మ ఆలయం కోసం 6.5 ఎకరాలు, అమ్మాపూర్‌తండా గ్రామంలో రోడ్డు కోసం ఎకరా అటవీ భూమిని కేటాయించేందుకు కమ్యూనిటీ అవసరాల కింద ఆమోదం లభించింది.
- వనపర్తి జిల్లాలో మొత్తం 3,164 పోడు దరఖాస్తులు రాగా.. 415 దరఖాస్తులకు ఆమోదం లభించింది. జిల్లాలోని వనపర్తి, ఖిల్లాఘనపురం, పెద్దమందడి మండలాల్లో మొత్తం 481 ఎకరాల భూమి రైతులు సాగుచేసుకుంటున్నట్లు గుర్తించారు. అయితే దరఖాస్తు చేసుకున్న రైతుల్లో 415 మందికే ఆమోదం లభించగా.. వారికి కూడా పట్టాలు పంపిణీ చేయడం లేదు.
- నారాయణపేట జిల్లాలో పోడు పట్టాల కోసం మొత్తం 377 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే అటవీ అధికారులు మాత్రం జిల్లాలో మొత్తం 403 ఎకరాల అటవీ భూమి ఆక్రమణలో ఉన్నట్టు గుర్తించారు. వీటిలో నారాయణపేట, ధన్వాడ మండలాల్లోనే అధికంగా అన్యాక్రాంతమైనట్టు నివేదికలో పేర్కొన్నారు.



లింగాల మండలం చెన్నంపల్లిలో రైతుల సాగులో ఉన్న అటవీ భూములు

ఉమ్మడి జిల్లాలో పోడు దరఖాస్తుల వివరాలు..

జిల్లా	దరఖాస్తులు	రైతులు క్లెయిమ్‌ చేసుకున్న భూమి (ఎకరాల్లో)
నాగర్‌కర్నూల్‌	7,514	5,417
మహబూబ్‌నగర్‌	4,528	3,544
వనపర్తి	3,164	4,194
నారాయణపేట	377	647

(జోగులాంబ గద్వాల జిల్లాలో పోడు భూములు లేవు)

ఆధారాలు లేకపోవడంతో..

పోడు రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను మండల, డివిజన్‌, జిల్లా స్థాయిల్లో కమిటీలు పరిష్కరించే ప్రక్రియ గతేడాది జనవరిలోనే ప్రారంభమైంది. ఈ దరఖాస్తుల పరిష్కారానికి ఆర్‌ఓఎఫ్‌ఆర్‌ చట్టం–2005 మార్గదర్శకాలే కీలకంగా మారాయి. ఈ చట్టం కింద 2005 కన్నా ముందు, ఆ తర్వాత సాగులో ఉన్న పోడు రైతులను అధికారులు గుర్తించారు. రైతులు తాము కనీసం 30 ఏళ్లుగా సాగులో ఉన్నట్టు ఆధారాలు సమర్పించాల్సి ఉంటుంది. అయితే ఈ ప్రక్రియలో అధికారులు దరఖాస్తుల్లో సింహభాగం తిరస్కరించేందుకే ప్రాధాన్యం చూపినట్టు తెలుస్తోంది. అధికారులకు అందిన మొత్తం దరఖాస్తుల్లో 20 శాతం కూడా ఆమోదం పొందలేదు. ఏళ్లుగా సాగులో ఉన్నట్టు తగిన ఆధారాలు చూపకపోవడంతో ఎక్కువ శాతం దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. డివిజన్‌, జిల్లా స్థాయి కమిటీల ద్వారా ఆమోదం పొందిన దరఖాస్తులకు సైతం ఇప్పటివరకు పోడు పట్టాలు పంపిణీ చేయలేదు.

ఎడతెగని పంచాయితీ

పోడు పట్టాల పంపిణీ కొలిక్కి రాకపోవడంతో ఏళ్లుగా అటవీశాఖ అధికారులు, రైతులకు మధ్య వివాదం కొనసాగుతోంది. ప్రతిఏటా వానాకాలం సాగు సమయంలో విత్తనాలు వేసే రైతులను అధికారులు అడ్డుకోవడం, తర్వాత ఉద్రిక్తతకు దారితీయడం పరిపాటిగా మారింది. ఒకవైపు అటవీ భూములను ఆక్రమించారంటూ అటవీ శాఖ అధికారులు.. తాతల కాలం నుంచి సాగుచేసుకుంటున్నామంటూ పోడు రైతుల మధ్య వాగ్వాదం చెలరేగుతోంది. ఇప్పటికైనా పోడుపట్టాల పంపిణీ ద్వారా పోడు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని పోడు రైతులు డిమాండ్‌ చేస్తున్నారు. అలాగే పోడు సమస్యను పరిష్కరించి భవిష్యత్‌లోనూ అటవీ భూముల ఆక్రమణకు గురికాకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

తాతల కాలం నుంచే..



మా కుటుంబం అడవిలోని మూడు ఎకరాలు సాగు చేసుకుంటున్నాం. కుటుంబమంతా ఈ భూమిపైనే ఆధారపడి బతుకుతున్నాం. మా తాతల కాలం నుంచే భూమి సాగులో ఉంది. ఇప్పటి వరకు పోడు పట్టా రాలేదు. ప్రభుత్వం త్వరగా పోడు పట్టాలను అందించి ఆదుకోవాలి.

– చిగుళ్ల లింగమ్మ, కొమ్మనపెంట, అమ్రాబాద్‌ మండలం, నాగర్‌కర్నూల్‌ జిల్లా

ఆదేశాలు రావాలి..

జిల్లాలో పోడు భూముల దరఖాస్తుల పరిష్కారం కోసం సర్వే చేసి, 2వేల వరకు దరఖాస్తులను పరిష్కరించాం. అర్హులైన పోడు రైతులకు పట్టాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పట్టాల పంపిణీపై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది.

– రోహిత్‌ గోపిడి, జిల్లా అటవీ శాఖాధికారి, నాగర్‌కర్నూల్‌

క్లుప్తంగా

నీటి గుంతలో పడి వ్యక్తిమృతి



మల్దకల్: పశువులు మేపేందుకు వెళ్లిన ఓ వ్యక్తి నీటిలో పడి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని మేకలసోంపల్లి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ముష్టి మునిస్వామి (35) తనకున్న పాడి పశువులను మేపేందుకు రోజులాగే వ్యవసాయ పొలాలకు వెళ్లాడు. వ్యవసాయ పొలంలో పశువులు నీరు తాగేందుకు వెళ్లగా వాటిని బయటకు పంపించేందుకు నీటి గుంత దగ్గరకు వెళ్లిన మునిస్వామికి ఫిట్స్ వచ్చింది. దీంతో అతడు నీటి గుంతలో పడి అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన చుట్టూ పక్కల పొలాల రైతులు విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు. వారు అక్కడకు చేరుకుని బోరున విలపించారు. మునిస్వామికి భార్య సువర్ణమ్మ, కుమారుడు ఉన్నారు. విషయం తెలుసుకున్న మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ప్రభాకర్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు.

వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం



కంచె నారాయణ (ఫైల్)

మరికల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన గురువారం రాత్రి మరికల్ శివారులో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. ధన్వాడకు చెందిన కంచె నారాయణ(52) మరికల్‌లోని ఎంఆర్ఎఫ్ టైర్ షాపులో పని చేస్తున్నాడు. దేవరకద్ర మండలం ముచ్చింతల గ్రామంలో బంధువుల ఇంట్లో విందుకు వెళ్లి తిరిగి బైక్‌పై ధన్వాడకు వస్తున్నాడు. ఈ క్రమంలో మరికల్ శివారులోని శ్రీవాణి పాఠశాల సమీపంలో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మురళి తెలిపారు.

యువకుడి ఆత్మహత్య



వినోద్ (ఫైల్)

కేటీదొడ్డి: ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. బంధువుల వివరాల మేరకు కేటీదొడ్డికి చెందిన ఆంజనేయులు, సరోజమ్మల దంపతులకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు వినోద్ (23)కు మాచర్ల గ్రామానికి చెందిన యువతితో ఆరు నెలల క్రితం వివాహం అయ్యింది. హం జరిగింది. గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యువకుడికి మానసికంగా బాగు లేదని కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపారు.

నీటిగుంతలో పడి బాలుడు మృతి



బాలుడు భద్రం (ఫైల్)

హన్వాడ: ఆడుకుంటూ వెళ్లి మూడేళ్ల బాలుడు నీటిగుంతలో పడి మృతి చెందిన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. మండలంలోని నాగినోనిపల్లికి చెందిన మదాసు చెంచు సావిత్రి కుమారుడు మదాసు భద్రం(3)ను తీసుకొని తల్లిగారి ఊరైన వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం సాల్విడ్‌కు వెళ్లింది. పొలం వద్ద జొన్నపంట కోతపనులకు బాలుడిని తీసుకెళ్లింది. పొలం వద్ద ఆడుకుంటూ ఉన్న బాలుడు నీటిగుంత వద్దకు వెళ్లి నీటిలో కూరుకుపోయి మృతిచెందాడు. కోత పనుల్లో నిమగ్నమైన తల్లి గమనించ లేదు. తర్వాత బాలుడు కనిపించకపోవడంతో వెతికారు. నీటిగుంతలో బాలుడు తేలాడుతూ కనిపించాడు. వెంటనే బాలుడిని పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. స్వగ్రామం నాగినోనిపల్లికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. తల్లి సావిత్రి రోదనలు స్థానికులను కలచివేశాయి. వారికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఈ మేరకు కుల్కచర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెరువులో మునిగి యువకుడు..

పాన్‌గల్: చెరువులో మునిగి ప్రమాదవశాత్తు యువకుడు మృతి చెందిన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు వివరాల ప్రకారం.. మండలంలోని దొండాయిపల్లి గ్రామానికి చెందిన పెద్దముక్కల ఆంజనేయులు(28) జంగిడి పశువులను మేపేందుకు వెళ్లాడు. గ్రామ సమీపంలోని మొండికుంట చెరువులోకి దిగి ఈత కొడుతూ అవతలివైపు వెళ్లేందుకు ప్రయత్నించాడు. చెరువులో కంప చెట్లు, రబ్బరు చెట్లకు తట్టుకొని నీటిలో మునిగి ఊపిరి ఆడక చనిపోయాడు. అతని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విజయ డెయిరీకి తాళం



జడ్చర్లలో విజయ డెయిరీ గేటుకు తాళం వేస్తున్న రైతులు

- రూ.3 కోట్ల బిల్లులు రావాలంటూ రోడ్డెక్కిన రైతన్నలు
- సిగ్నల్‌గడ్డ వద్ద రోడ్డుపై పాలు పారబోసి నిరసన
- పురుగు మందు డబ్బాలతో హల్‌చల్



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

జడ్చర్ల టౌన్: జీవనాధారం కోసం పాడి పశువులను పెట్టుకుని పాలను ప్రభుత్వ విజయ డెయిరీ పోస్తూ బతుకీడుస్తున్న రైతన్నలు సకాలంలో బిల్లులు రాక గురువారం ఆందోళనకు దిగారు. తాము నిత్యం పాలుపోసే విజయ డెయిరీకి తాళం వేసి సిగ్నల్‌గడ్డ వద్ద రోడ్డుపై పాలు పారబోసి నిరసన తెలిపారు. జడ్చర్ల విజయ డెయిరీ పరిధిలో జడ్చర్ల, రాజాపూర్ మండలాలతోపాటు బాలానగర్, మిడ్జిల్ మండలాల్లోని సగం గ్రామాలకు చెందిన మొత్తం 480 మంది రైతులు నిత్యం 8– 10 వేల లీటర్ల పాలను విజయ డెయిరీకి పోస్తే.. ప్రతి 15 రోజులకోమారు బిల్లులు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తారు. అయితే జూలై 1 నుంచి ఇప్పటి వరకు 5 బిల్లులు సుమారు రూ.3 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోవడంతో కొందరు రైతులు గురువారం డెయిరీ వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు.

సిబ్బందిని నిర్బంధించి..

రైతులు విజయ డెయిరీకి చేరుకుని సిబ్బందిని లోపలే ఉంచి తాళం వేశారు. బిల్లులు ఇవ్వకుంటే తమకు చావే దిక్కని కొందరు రైతులు పురుగు మందు డబ్బాలు ప్రదర్శించారు. డెయిరీకి తాళం వేసి అక్కడి నుంచి సిగ్నల్‌గడ్డకు చేరుకుని ధర్నాకు దిగారు. రోడ్డుపై పాలు పారబోసి నిరసన తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లాకు వెళ్లి వస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని అడ్డుకోవాలని యత్నించినప్పటికీ ఆయన ముందుగానే వెళ్లిపోవడంతో ఆ ప్రయత్నం విరమించారు. సిగ్నల్‌గడ్డ ప్రధాన రహదారిపై ధర్నాకు దిగడంతో పోలీసులు అక్కడికి చేరుకుని నచ్చజెప్పారు. దీంతో రైతులు ధర్నా విరమించి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం అందజేశారు. సోమవారం వరకు బిల్లులు చెల్లించకుంటే ప్రజావాణికి వెళ్లి అక్కడే నిరసన వ్యక్తం చేస్తామని తేల్చిచెప్పారు. ఈ విషయమై విజయ డెయిరీ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ కవితను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్‌కు స్పందించలేదు.

5 బిల్లులు రాలేదు..



ఆరు నెలలుగా విజయ డెయిరీకి పాలు పోస్తున్నా. జూలై 1 నుంచి ఇప్పటి వరకు 5 బిల్లులు రాలేదు. రూ.40 వేల బిల్లు నాకు రావాల్సి ఉంది. టైంకు బిల్లులు రాకుంటే ఏం చేయాలో తోచడం లేదు. ప్రభుత్వం స్పందించి వెంటనే బిల్లులు ఇవ్వాలి. అలాగే ప్రతి 15రోజులకోమారు తప్పనిసరిగా బిల్లులు ఇచ్చేలా చూడాలి. – ఆంజనేయులు, గుండ్లపొట్లపల్లి, రాజాపూర్ మండలం

దాట వేస్తున్నారు..



జూలై నుంచి బిల్లులు వస్తలేవు. అడిగితే ఈ రోజు.. రేపు అంటూ దాటేస్తున్నరు. పాడినే నమ్ముకున్నం ఇట్లయితే మాకు చావేగతి. ఒక బిల్లు ఆలస్యమైందంటే ఏదోలా సర్దుకుంటాం. ఇలా 5 బిల్లులు ఇవ్వకుంటే మేం ఏం తినాలి.. పశువులకు ఏం పెట్టాలి. ప్రభుత్వం ఇప్పటికైనా మా బాధను అర్థం చేసుకుని సకాలంలో బిల్లులు ఇవ్వాలి. – శ్రీనివాస్‌రెడ్డి, ఆలూరు, జడ్చర్ల మండలం

రైతులు నిలదీస్తున్నారు..



బాలానగర్ మండలం కేతిరెడ్డిపల్లి నుంచి నేను 40 మంది రైతులతో ప్రతిరోజు 400 లీటర్ల పాలు సేకరించి.. విజయ డెయిరీకి పోస్తున్న. రోజూ నన్ను బిల్లులు ఏమైంది అని రైతులు నిలదీస్తున్నారు. వారికి ఏం సమాధానం చెప్పాలో తెలియడం లేదు. అందుకే ఈ రోజు కొంతమంది రైతులు రాగా ఇక్కడికి వచ్చాను. నాతోపాటు వారంతా బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారు. త్వరగా బిల్లు ఇవ్వాలి. – కృష్ణయ్య, పాల ఏజెంట్, కేతిరెడ్డిపల్లి, బాలానగర్ మండలం

సౌర విద్యుత్ కోసం ఇంటింటి సర్వే

దసరాలోపే కొండారెడ్డిపల్లిలో సోలార్ వెలుగులు



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

వంగూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన సౌర విద్యుత్ ప్రాజెక్టును సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామమైన కొండారెడ్డిపల్లిని ఎంపిక చేశారు. అందులో భాగంగా విద్యుత్, రెడ్‌కో అధికారులు గ్రామంలో పర్యటించి వివరాలు సేకరిస్తున్నారు. దసరా పండుగ రోజు సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామానికి రానుండడంతో పైలెట్ ప్రాజెక్టుగా కొండారెడ్డిపల్లిలో సౌరవిద్యుత్ అందిచాలన్న లక్ష్యంతో అధికారులు పని చేస్తున్నారు. రెండు రోజుల పాటు గ్రామంలో అధికారులు 90శాతం సర్వేను పూర్తిచేశారు. గ్రామంలో 499 విద్యుత్ మీటర్లు ఉండగా గురువారం 400 పైచిలుకు ఇళ్లలో విద్యుత్ అధికారులు మొదటగా సర్వే చేస్తున్నారు. ఇంటి యజమాని ఆధార్, ఫోన్, సర్వీస్ మీటర్ల నంబర్లతో పాటు బ్యాంకు ఖాతా నంబర్‌ను సేకరించి రెడ్‌కో అధికారులకు అందజేస్తున్నారు. రెడ్‌కో అధికారులు 16 బృందాలుగా ఇంటింటికి వెళ్లి ఆ ఇంటికి అవసరమైన విద్యుత్ ఎంత, సోలార్ ప్లేట్లు అమర్చేందుకు ఇంటిపైన స్థలం ఉందా, అన్న సాధ్యాసాధ్యాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తున్నారు. సర్వే కార్యక్రమంలో జిల్లా పశువర్ధకశాఖ అధికారి, కొండారెడ్డిపల్లి స్పెషల్ ఆఫీసర్ రమేష్, ఏడీ శ్రీధర్‌రెడ్డి, ఏఈ మేఘనాథ్, ఎంపీడీఓ విజయభాస్కర్, ఏపీఓ దేవేందర్, ఏపీఎం చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఆర్డర్ 954ను రద్దు చేయాలి



విద్యుత్ భవన్ ముందు నిరసన వ్యక్తం చేస్తున్న తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ సంక్షేమ సంఘం యూనియన్ నాయకులు

టీజీ ఎస్పీడీసీఎల్ కంపెనీ ప్రధాన కార్యదర్శి బీచుపల్లి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రభుత్వ ఆర్డర్‌కు వ్యతిరేకంగా తెచ్చిన ట్రాన్స్ కో ఆర్డర్ 954ను రద్దు చేయాలని టీజీ ఎస్పీడీసీఎల్ కంపెనీ ప్రధాన కార్యదర్శి బీచుపల్లి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం విద్యుత్ ఉద్యోగులు విద్యుత్ భవన్ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఇన్ ప్రమోషన్‌ని సంస్థలో సరైన పద్ధతిలో అమలు చేయకపోవడంతో ఎస్సీ, ఎస్టీ, మహిళ ఉద్యోగులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. యాజమాన్యాలు ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పట్ల వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తమ హక్కులను సాధించుకోవడానికి విద్యుత్ ఉద్యోగులు పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సంస్థపై వత్తిడి పెంచేందుకు అంచలంచెలుగా ఉద్యమం చేసేందుకు ఉద్యోగులు సిద్ధం కావాలన్నారు. ట్రాన్స్‌కో ఆర్డర్ 954 వల్ల ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులకు ప్రమోషన్లలో తీవ్ర అన్యాయం జరుగుతుందని, వెంటనే దాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 16వ తేదీ వరకు ఎస్ఈ కార్యాలయం, డివిజనల్ కార్యాలయాల ముందు మధ్యాహ్నం భోజన సమయంలో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణనాయక్, ప్రధాన కార్యదర్శి గంగాధర్, డివిజన్ అధ్యక్షుడు తిరుపతయ్య, కార్యదర్శి రామకృష్ణ, సత్యం, రాంచంద్రయ్య, హుస్సేన్, చంద్రమౌళి పాల్గొన్నారు.

మట్కా ఆడుతున్న ముగ్గురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ఇజాజుద్దీన్

మహబూబ్‌నగర్ క్రైం: మట్కా ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ ఇజాజుద్దీన్ వివరాలు వెల్లడించారు. జిల్లాకేంద్రంలోని ఎంబీసీ చర్చి సమీపంలో మహ్మద్ యూసుఫ్, మహ్మద్ షకీల్ ఖాన్, మహ్మద్ ఖలీల్ అనే ముగ్గురు వ్యక్తులు మట్కా ఆడుతున్నట్లు సమాచారం రాగా దాడులు చేసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ.14,300 నగదు, ఒక బైక్, ఒక సెల్‌ఫోన్ సీజ్ చేసినట్లు వెల్లడించారు. సదరు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. పేకాట, మట్కా, గంజాయి వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు ఎక్కడ జరిగినా డయల్100కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు



108 వాహనంలో క్షతగాత్రులు

మహమ్మదాబాద్: ఉమ్మడి జిల్లాలో వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డ ప్రమాదాల్లో నలుగురు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. వికారాబాద్ జిల్లా దోమ మండలానికి చెందిన రమేష్, తేజప్ప మహమ్మదాబాద్‌లోని బంధువుల ఇంటికి శుభకార్యం నిమిత్తం వచ్చారు. ద్విచక్రవాహనంపై తిరిగి వెళ్లే క్రమంలో మహబూబ్‌నగర్ నుంచి తాండూరు వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న ఇద్దరికి గాయాలవడంతో 108లో జనరల్ ఆస్పత్రికి తరలించారు. స్థానిక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన లారీని అదుపులోకి తీసుకున్నారు.

రెండు బైక్‌లు ఢీకొని..

వనపర్తి రూరల్: బైక్‌లు ఎదురుగా ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. పెబ్బేరు మండలం చెలిమిల్ల గ్రామానికి చెందిన ఆంజనేయులు, బునాదిపురం గ్రామానికి చెందిన శివ ఇద్దరు బైకులపై వస్తూ బునాదిపురం వెళ్లే రహదారిపై ఎదురుగా ఢీకొట్టుకున్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలు కావడంతో వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో రాణించాలి

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు రాణించాలని జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.రాములు, ఆర్.బాల్‌రాజు తెలిపారు. గత 22వ తేదీన జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయిలో ఎంపికైన క్రీడాకారుల వివరాలను గురువారం ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు తమ ధ్రువపత్రాలతో ఈనెల 14వ తేదీన మెయిన్ స్టేడియంలో రిపోర్టు చేయా లని కోరారు. మిగతా వివరాల కోసం 9052554298 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఎంపికైన యోగా క్రీడాకారులు

అండర్ 8–10 విభాగంలో మణిదీప్, శ్రీనిష్, అరవింద్ సాయి, రాధిక వర్షిణి, చెరుబ అగ్రీస్, వైష్ణవి, నిహారిక, హంశు, అండర్ 10–12 విభాగంలో సంజయ్ కుమార్, హరికృష్ణ, సంతోషకుమార్, హర్షిత్, ధనూష్, సంధ్యారాణి, స్వప్న, వర్షిణి, క్రిష్ణవేణి, నవత, అండర్ 12–14 విభాగంలో చరణ్, బాలు, ప్రేమ్ చౌహాన్, సుశీల్‌కుమార్, సుజన్‌కుమార్, సింధుబాయ్, నందిని, వర్షిత, పవిత్ర, శ్రీజ, అండర్ 14–16 విభాగంలో తిరుపతి, వరుణ్, శివతేజ, అఖిల్, అవినాష్, కీర్తనారెడ్డి, వైష్ణవి, వైజయంతి, తనుశ్రీ, స్వర్ణలత, అండర్ 16–18 విభాగంలో ప్రవీణ్, చైతన్య, నవీన్, విశాల్, శిరీష, ఎం.సింధు, నందిని, భార్గవి, అఖిల, అండర్ 18–21లో సాగర్, మధు, ఆకాశ్, బి.స్వప్న, శ్వేత, కల్యాణి, అంకిత, కావేరి, అండర్ 25–30లో ప్రవీణ్, శ్రీకాంత్, బాలమణి, అండర్ 35–45 విభాగంలో వెంకటేశ్, మల్లేశం, అండర్–45 ఏళ్ల విభాగంలో వనజారెడ్డి ఎంపికైనట్లు తెలిపారు.

జూరాలకు మరింత తగ్గిన ఇన్‌ఫ్లో



జూరాల ప్రాజెక్టు రిజర్వాయర్

ధరూరు : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో మరింత తగ్గు ముఖం పట్టినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. బుధవారం సాయంత్రానికి 1,16,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. గురువారం సాయంత్రానికి 90వేల క్యూసెక్కులకు తగ్గినట్లు పేర్కొన్నారు. 4 గేట్ల ద్వారా 28,300 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేసినట్లు వివరించారు. కాగా నెట్టెంపాడులో ఒక పంపును ప్రారంభించారు. విద్యుత్ కేంద్రంలో 11 యూనిట్లను కొనసాగించి విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. ఇందుకోసం 37021 క్యూసెక్కుల నీరు వినియోగిస్తున్నారు. జూరాల 4 క్రస్టు గేట్ల ద్వారా 28,300, ఆవిరి రూపంలో 94, నెట్టెంపాడు ఎత్తిపోతల ద్వారా 750, ఎడమ కాల్వకు 730, కుడి కాల్వకు 590 ఇలా.. మొత్తం 67,485 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కాగా గురువారం రాత్రి 9 గంటల ప్రాంతంలో జూరాల గేట్లు అన్ని మూసి వేసినట్లు అధికారులు వివరించారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 8.949 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం స్వల్పంగా కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు 45వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి 9 గేట్ల ద్వారా 32,843 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 37.64 టీఎంసీలు కాగా...ప్రస్తుతం ప్రాజెక్టులో 32.843 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

లక్ష్యానికి చేరువలో విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాలప్రాజెక్టు దిగువ, ఎగువ కేంద్రాల్లో విద్యుదుత్పత్తిని వేగవంతంగా కొనసాగుతుందని జెన్‌కో సివిల్, ఎలక్ట్రికల్ ఎస్ఈలు సురేష్, సూరిబాబు అన్నారు. ఎగువ నుంచి అత్యధికంగా వరదనీరు చేరడంతో దిగువ విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేపట్టలేకపోయామని పేర్కొన్నారు. వరద ఇదేస్థాయిలో కొనసాగితే ఈ ఏడాది లక్ష్యానికి చేరుకుంటామన్నారు. 11 యూనిట్లద్వారా విద్యుదుత్పత్తి చేపడుతున్నామని వివరించారు. ఎగువలో 195 మెగావాట్లు, దిగువలో 240 మెగావాట్లు ఉత్పత్తిని చేపడుతున్నట్లు వివరించారు. ఇప్పటివరకు 290.322 మిలియన్ యూనిట్ల ఉత్పత్తిని సాధించామన్నారు. ఎగువ జూరాల 3 వ యూనిట్లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో ఉన్నత అధికారులకు నివేదించామని.. ప్రస్తుతానికి ఉత్పత్తి చేపట్టలేక పోతున్నామని వివరించారు. డీఈలు పవన్‌కుమార్, రాజు, రూపేష్, ఈఈ దర్బార్‌వలీ, సిబ్బంది ఉన్నారు.

సుంకేసులకు తగ్గిన ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసుల డ్యాంకు గురువారం ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా తగ్గింది. ఎగువ నుంచి 22,641 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఐదు గేట్లు తెరిచి 20,196 క్యూసెక్కులు, కేసీ కెనాల్‌కు 2,445 క్యూసెక్కులు వదులుతున్నట్లు జేఈ రాజు తెలిపారు.

గొర్రెల పెంపకందారులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలి



ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులు

స్టేషన్ మహబూబ్‌నగర్: గొర్రెల పెంపకందారులకు సబ్సిడీ రుణాలు ఇవ్వాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఏహెచ్‌డీడీ, ఎఫ్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ సబ్యసాచి ఘోష్‌కు జిల్లా గొర్రెల పెంపకందారుల సంఘం సభ్యులతో కలిసి వినతిపత్రం అందజేశారు. మహబూబ్‌నగర్ జిల్లా యూనియన్ మొత్తంలో లక్షకుపైగా సభ్యులు ఉన్నారని, వీరంతా గొర్రెలను నమ్ముకొని జీవనం సాగిస్తున్నారన్నారు. వీరికి 2012లో 20 శాతం సబ్సిడీతో రూ.64 కోట్ల రుణం మంజూరు చేశారని గుర్తుచేశారు. గతంలో రుణం పొందిన వారిలో 1,640 మంది సభ్యులు పూర్తిస్థాయిలో తిరిగి చెల్లించారన్నారు. గొర్రెల కాపరుల నుంచి భారీగా డిమాండ్ ఉన్నందున మహబూబ్‌నగర్ జిల్లాలో కొత్తగా గొర్రెల పెంపకందారులకు రుణాలు మంజూరు చేసేందుకు 20 శాతం సబ్సిడీతో రూ.200 కోట్లు మంజూరు చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో జిల్లా గొర్రెల పెంపకందారుల సంఘం చైర్మన్ శాంతన్నయాదవ్, డైరెక్టర్ రాజగోపాల్ యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, లక్ష్మణ్‌యాదవ్ తదితరులున్నారు.

మాజీ మంత్రి, ఎమ్మెల్యేలను పరామర్శించిన మంత్రి పొంగులేటి



శ్వేతారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పక్కన మాజీ మంత్రి లక్ష్మారెడ్డి తదితరులు



కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి మహేందర్‌రెడ్డి

జడ్చర్ల/చిన్నచింతకుంట: మాజీ మంత్రి లక్ష్మారెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిలను గురువారం రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల మాజీ మంత్రి లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతారెడ్డి అకాల మరణం చెందడంతో ఆయనను పరామర్శించేందుకు మంత్రి పొంగులేటి హైదరాబాద్ నుంచి నేరుగా నాగర్‌కర్నూల్ జిల్లా తిమ్మాజిపేట మండలం ఆవంచకు చేరుకున్నారు. లక్ష్మారెడ్డి నివాసంలో శ్వేతారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీమంత్రి లక్ష్మారెడ్డితో కొద్దిసేపు మాట్లాడి మనోధైర్యం కల్పించారు. అలాగే రాజ్యసభ సభ్యుడు సంతోష్‌రావు, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు తదితరులు శ్వేతారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆమె మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. అలాగే దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తండ్రి కృష్ణారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించగా.. మంత్రి పొంగులేటితో పాటు మాజీ మంత్రి మహేందర్‌రెడ్డితో కలిసి దమగ్నాపురంలో ఎమ్మెల్యేను పరామర్శించారు. కృష్ణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఆటోలో రూ. 5 లక్షలు చోరీ



డబ్బులు చోరీకి గురైన ఆటో ఇదే..

మరికల్: ఓ సిగరేట్ కంపెనీకి చెందిన ఆటోలో రూ. 5 లక్షలు చోరీకి గురైన ఘటన మరికల్‌లోని ఓ కిరాణ దుకాణం ఎదుట గురువారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. మక్తల్‌కు చెందిన సెల్స్‌మ్యాన్ అరుణ్ ఆయా గ్రామాల్లోని కిరాణ దుకాణాల్లో సిగరేట్ ప్యాకెట్లను అమ్ముకుంటూ వ్యాపారులు ఇచ్చిన డబ్బులను బ్యాగులో పెట్టుకొని ఆటోలో మరికల్‌కు చేరుకున్నాడు. రాయిచూర్ రోడ్డు పక్కన ఓ కిరాణ దుకాణం దగ్గరకు రాగానే ఆటో టైర్‌లో గాలిపోవడంతో రోడ్డు పక్కకు నిలిపారు. డ్రైవర్ టైర్‌కు గాలి కొడుతుండగా, సెల్స్‌మాన్ దుకాణంలో డబ్బులు తీసుకుంటున్నాడు. కాగా అప్పటికే ఆటోను గమనిస్తూ వస్తున్న గుర్తు తెలియని వ్యక్తి.. డ్రైవర్ సీటు దగ్గర అద్దం కిందకు దించి రూ. 5 లక్షలు ఉన్న బ్యాగు తీసుకుని క్షణాల్లో పరారయ్యాడు. ఇదంతా అక్కడ ఉన్న సీసీ పుటేజీలో రికార్డయ్యింది. విషయంపై బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో వారు వ్యక్తి ఆచూకీ కోసం రంగంలోకి దిగారు.

చిక్కినట్లే చిక్కి పారిపోయిన దొంగ



పారిపోయిన దొంగ

జడ్చర్ల టౌన్: చిక్కినట్లే చిక్కి దొంగ పారిపోవడంతో పట్టుకున్న వాళ్లు ఖంగుతిన్నారు. బీరువాలు, గ్యాస్‌స్టౌలు రిపేర్ చేస్తానని మైకులు పట్టుకుని ప్రచారం చేస్తూ ఓ వ్యక్తి చిన్నపాటి దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఇదే క్రమంలో గురువారం పట్టణంలోని సత్తూర్ కాంప్లెక్స్ పక్కన ఉన్న పెట్రోల్‌బంక్ సమీపంలోని పాన్‌షాప్‌లో సిగరెట్ డబ్బాలు, నగదు ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నిస్తుండగా దుకాణ యజమాని గమనించి వెంటబడి పట్టుకున్నాడు. కాలనీవాసులు అక్కడికి చేరుకుని దేహశుద్ధి చేయడంతో పట్టణంలోని పలు కాలనీల్లో తాళం వేసిన ఇళ్లలో చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. దీంతో పోలీసులకు పట్టించేందుకు వారికి సమాచారం అందించారు. ఈ క్రమంలోనే దొంగ అందరి కళ్లుగప్పి పారిపోయాడు. దీంతో చేసేదేమిలేక చిక్కినట్లే చిక్కి పోయాడే అంటూ నిట్టూర్చారు.